


17న పాలకొండలో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - పార్వతీపురం

పాలకొండలో మెగాజాబ్ మేళాను ఈనెల 17న నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా పది, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బిటెక్, ఎంఎస్సీ విద్యార్హతలు కలిగి, 18 నుండి 30 ఏళ్ల వయస్సు గల యువతీ, యువకులు అర్హులన్నారు. జాబ్ మేళా 17న ఉదయం 9 గంటల నుంచి పాలకొండ శ్రీ సత్య సాయి డిగ్రీ కళాశాలలో జరుగుతుందన్నారు. ఈ మెగా జాబ్ మేళాకు 16 కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని, 1050 పోస్టులు ఆయా కంపెనీల్లో భర్తీ చేస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరాలను skilluniverse.apssdc.in వెబ్‌సైట్‌లో విధిగా నమోదు చేసుకోవాలని చెప్పారు. వివరాలకు 6301275511, 7993795796 ఫోన్ నంబర్లకు సంప్రదించ వచ్చని తెలిపారు.

మంత్రి మొదటి సంతకం అమలయ్యేదెప్పుడో?

ఈ సీజన్‌లో ఎఎన్ఎంల నియామకం లేనట్టేనా?
రెండు నెలలైనా కార్యరూపం దాల్చని వైనం

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటిపోయింది. గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన గుమ్మిడి సంధ్యారాణి తొలిసారి సంతకం చేసిన ఫైలు ఇంతవరకు ముందుకు కదల్లేదు. ఆర్థిక శాఖ వద్ద గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంల నియామకానికి సంబంధించిన ఫైలు పెండింగ్‌లో వుండిపోయింది. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సంధ్యారాణి ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంల నియామకానికి సంబంధించిన ఫైలుపై తొలి సంతకం చేశారు. ఆమె మొదటి సంతకం చేసిన ఫైలు ఇంతవరకు కార్యరూపం దాల్చకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది జూన్‌తో వర్షాకాలం సీజన్ మొదలైంది. ఇప్పటికే వర్షాలు దండిగా పడుతున్నాయి. విష జ్వరాలు, మలేరియా, డెంగీ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఏజెన్సీలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు తరచుగా జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. మన్యం జిల్లాలో 65 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. ఒక్కో పాఠశాలకు ఇద్దరు చొప్పున ఎఎన్ఎంల నియామకం చేపట్టాల్సి ఉంది. ప్రతి ఆశ్రమ పాఠశాలలోనూ జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థులు ఉన్నారు. పాఠశాలల్లో ఎఎన్ఎంల నియామకమైతే విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ బాధ్యతలు వారే నిర్వహిస్తారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని బట్టి ఆసుపత్రికి తీసుకెళ్లాలా, వసతిగృహాల్లోనే వైద్యం అందించాలా అనేది దానికి ఎఎన్ఎంలు బాధ్యత వహించాల్సి ఉంటుంది. అయితే ఎఎన్ఎంలు లేకపోవడంతో హాస్టల్ వార్డెన్లు, హెచ్ఎంలే విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ బాధ్యతలు వహించాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. వైద్య పరిజ్ఞానం లేని కారణంగా వార్డెన్లు, హెచ్ఎంలు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయలేకపోతున్నారు. దీనివల్ల కొంత జాప్యం జరిగి విద్యార్థుల ఆరోగ్యం విషమించే పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఈ ఏడాది సీజన్‌లో ఇంతవరకు వందల సంఖ్యలో విద్యార్థులు మలేరియా, వైరల్ జ్వరాల బారిన పడ్డారు. మరో నెల రోజుల్లో వర్షాకాలం ముగియనుంది.



అనారోగ్యంతో సిక్‌రూంలో ఉన్న విద్యార్థులు (ఫైల్)

పని చేయని వాటర్ ప్లాంట్లు

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో గత కొంతకాలంగా వాటర్ ప్లాంట్లు పని చేయడం లేదు. దీని వల్ల విద్యార్థులకు రక్షిత మంచినీటి సరఫరా జరగడం లేదు. గతం టిడిపి ప్రభుత్వ హయాంలోనే ఆశ్రమ పాఠశాలల్లో వాటర్ ప్లాంట్ల ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ కాంట్రాక్టు పరిమితి ముగియడంతో అవి పని చేయడం లేదు.

జరగని దోమ తెరల పంపిణీ

వర్షాకాలం సీజన్ మొదలై రెండు నెలలు దాటినా ఇంతవరకు ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు దోమ తెరల పంపిణీ జరగలేదు. నాలుగేళ్ల క్రితం పంపిణీ చేసిన దోమ తెరలు ఇప్పుడు పాడయ్యాయి.

ఎఎన్ఎంల నియామకం చేపట్టాలి
డి.పండు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంల నియామకం వెంటనే చేపట్టాలి. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి తొలి సంతకం ఎఎన్ఎంల నియామకం ఫైలు పైనే చేసినట్లు చెప్పారు. ఇది జరిగి రెండు నెలలు దాటినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంల నియామకం జరగకపోవడంతో విద్యార్థు ఆరోగ్య పరిరక్షణ బాధ్యతలు వార్డెన్లు, హెచ్ఎంలపై పడుతోంది.

సబ్ కలెక్టర్‌ను కలిసిన కమిషనర్

ప్రజాశక్తి - పాలకొండ

సబ్ కలెక్టర్ యశ్వంత్‌రెడ్డిని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగర పంచాయతీలో డంపింగ్ యార్డు సమస్యపై చర్చించారు. సింగన్నవలస వద్ద డంపింగ్ యార్డుకు స్థలం గుర్తించామని వివరించారు.

ఇంగ్లీష్ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లీష్ సబ్జెక్టును గెస్ట్ ఫ్యాకల్టీ ప్రాతిపదికన బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుకున్నట్లు ప్రిన్సిపల్ టి. శ్రీవరం తెలిపారు. ఎంఎ ఇంగ్లీషు ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణ లైనవారు ఈనెల 12న సాయంత్రం ఐదు గంటల్లోపు కళాశాల కార్యాలయానికి దరఖాస్తులు సమర్పించాలన్నారు. 13న ఉదయం 11 గంటలకు కళాశాలలో జరగబోయే డెమో క్లాసుకు హాజరు కావాలని కోరారు.

జిఒ 85ను రద్దు చేయాలని
నల్లబ్యాడ్జీలతో పిహెచ్‌సి వైద్యుల నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సంఘం ఆధ్వర్యంలో జిఒ 85కు వ్యతిరేకంగా వివిధ దశల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ పి.రఘు కుమార్, డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 37 పిహెచ్‌సిల పరిధిలో గల వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఒ 85 ద్వారా తమ మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండా పోయిందన్నారు. ఇలా అకస్మాత్తుగా జీవోను మార్చడం అన్యాయమని, తమ వృత్తి ప్రగతికి తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. గత రెండు నెలలుగా జీవో 85 రద్దు చేయమని అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులిచ్చినా ఎటువంటి సమాధానం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోవిడ్ -19 సమయంలో తమ జీవితాలను ప్రమాదంలో పెట్టి సేవలందించినప్పటికీ, ఇప్పుడు జిఒ 85 ద్వారా పీజీ అవకాశాలు తగ్గించడం అన్యాయమన్నారు. ఇది ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో సేవలను ప్రభావితం చేస్తుందని అన్నారు. ఇందుకు నిరసనగా తమ ఆందోళనలో భాగంగా మొదటి రోజు మంగళవారం విధులు నిర్వహిస్తూ, నిరసనగా వైద్యులు నల్ల బ్యాడ్జీలను ధరిస్తామని తెలిపారు. 11, 12తేదీల్లో సేవల్లో అంతరాయం లేకుండా నిరసన కొనసాగుతుందన్నారు. ఈ రెండు రోజుల ప్రభుత్వ చర్చల కోసం ఎదురు చూస్తామని తెలిపారు. ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించకపోతే ఈనెల 13న పిహెచ్‌సి వైద్యులు అత్యవసర సర్వీసులను మినహాయించి, అన్ని రిపోర్టింగ్‌లు, విసి, టిసి, అధికారిక కమ్యూనికేషన్‌లు నిలిపివేస్తామని తెలిపారు. ఈనెల 14న పిహెచ్‌సి సేవలు కేవలం అత్యవసర వైద్య సేవలకు మాత్రమే పరిమితం చేయబడతాయన్నారు. ఈనెల 15న చలో విజయవాడ ర్యాలీ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం వద్ద జరుగుతుందన్నారు. ఈనెల 16నుంచి జిఒ 85రద్దు చేసేంత వరకూ నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభమవుతుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జిఒ 85ను రద్దు చేయాలని, వైద్యుల సమస్యలను పరిష్కరించడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.



నల్లబ్యాడ్జీ ధరించి విధులు నిర్వహిస్తున్న పెదబొండపల్లి వైద్యాధికారి



నల్లబ్యాడ్జీ ధరించి విధులు నిర్వహిస్తున్న కురుపాం వైద్యాధికారి ప్రజ్ఞ

ఇదిలా ఉండగా పార్వతీపురం మండలంలోని పెద్ద బొండపల్లి, బందలుప్పి, డోకి శిలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అనూష, శ్రీకాంత్, ఐశ్వర్య నల్ల బ్యాడ్జీలు ధరించి వైద్య సేవలు అందించారు.

మక్కువ : జిఒ 85ను రద్దు చేయాలని కోరుతూ నల్ల బ్యాడ్జీలతో మంగళవారం విధులకు హాజరయ్యారు. శంబర, మక్కువ పిహెచ్‌సిల్లో నల్ల బ్యాడ్జీలతోనే డాక్టర్లు కిరణ్ కుమార్, హరికష్ణ, నిఖిల రోగులకు వైద్య సేవలందించారు. ప్రభుత్వం వెంటనే జీవోను ఉపసంహరించుకోవాలని వారు కోరారు.

వీరఘట్టం : జిఒ 85ను రద్దు చేయాలని స్థానిక వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, ప్రదీప్ కుమార్ డిమాండ చేశారు. ఈ జీవోకు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలతో విధులు నిర్వహించారు.

కురుపాం : జీవో 85ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.ప్రజ్ఞ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిజి వైద్య విద్య ప్రవేశాల్లో సీట్లు కేటాయింపు శాతాన్ని తగ్గించడానికి నిరసిస్తూ మంగళవారం నుంచి దశలవారీగా ఆందోళనలు చేపడుతున్నామన్నారు. జీవో 85 ద్వారా తమ మూడేళ్ల సర్వీస్‌కు అర్థం లేకుండా పోయిందన్నారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈనెల15న చలో విజయవాడ నిర్వహిస్తామని, మరుసటి రోజు నుంచి జీఓ 85 రద్దు వరకు నిరవధిక నిరాహార దీక్షను కొనసాగిస్తామని అన్నారు.

సీతంపేట : జిఒ 85ను రద్దు చేయాలని వైద్యాధికారులు నల్ల బ్యాడ్జీలతో దోనుబాయి, మర్రిపాడు, కుసుమి వైద్యాధికారులు నిరసన తెలిపారు. ఈ జిఒ రద్దు చేయకపోతే తదుపరి డిమాండ్లతో నిరసనలు తెలుపుతామని వైద్యులు తెలిపారు. ఈ నిరసనలో కుసుమి, మర్రిపాడు, దోనుబాయి వైద్యులు చాందిని, రవీంద్ర, సాయి చరణ్, సత్యవేణి, భాను ప్రతాప్, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా రాస్తారోకో

ప్రజాశక్తి - పార్వతీపురం

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యాన మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద కార్మికులు, ఉద్యోగులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రాస్తారోకోనుద్దేశించి సిఐటియు రాష్ట్ర కార్యదర్శి తులసి రఘు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారానికి ముడిసరుకు సరఫరా చేయకపోవడంతో ఉత్పత్తి 50 శాతానికి తగ్గిందని చెప్పారు. అంతకుముందు 120 రేటింగ్‌తో అధిక ఉత్పత్తి సామర్థ్యం కలిగి వుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారానికి ముడిసరుకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ, శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిర, పౌర సంక్షేమ సంఘం సభ్యులు బి.సూరిబాబు, ఎస్.ఉమామహేశ్వరరావు , ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పండు పాల్గొన్నారు.

12న విశాఖ ఐటిఐలో జాబ్‌మేళా

గుమ్మలక్ష్మీపురం : దుబాయ్, యుఎఇ విదేశాల్లో పనిచేసేందుకు అనుభవం ఉన్నవాళ్లు, ఫ్రెషర్స్ ఎలక్ట్రీషియన్, వెల్డర్, ఫిట్టర్, మోటార్ మెకానిక్, డీజిల్ మెకానిక్, పెయింటర్ ట్రేడ్ల వారికి అశోక్ లైలాండ్ కంపెనీలో 150 ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు భద్రగిరి ఆర్ఐటిఐ ప్రిన్సిపల్ సిహెచ్ సునీల్‌కుమార్ తెలిపారు. ఈనెల 12న విశాఖపట్నం కంచరపాలెంలోని పాత ఐటిఐ వద్ద ఇంటర్వ్యూలకు హాజరు కావాలని అన్నారు. సర్టిఫికెట్, ఫొటోలు, ఆధార్ కార్డు జెరాక్స్‌తో వెళ్లాలని కోరారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు హాజరు కావాలన్నారు.

అడలిని అభివృద్ధి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

సీతంపేట మండలంలో గల అడలిని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. జిల్లా పర్యాటక మండలి సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అడలి మంచి పర్యాటక ప్రదేశమని, దాన్ని ఇంకా బాగా అభివృద్ధి చేయాలన్నారు. అడలి వెళ్లే మార్గం వాహనాల రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా చేయాలని, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేసి అడలి వ్యూ పాయింట్ బోర్డు ఏర్పాటు చేసి బ్రాండింగ్ చేయాలన్నారు. నిర్మాణాల సమయంలో రాళ్ల తొలగింపు జరిగిందని, అటువంటి ప్రదేశంలో రాళ్లు, మట్టి జారకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. గిరిజన మ్యూజియం పనులు వేగవంతం కావాలన్నారు. అటవీ శాఖ ద్వారా చేపడుతున్న పర్యాటక అభివృద్ధి ప్రదేశాల్లో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయాలని ఆయన సూచించారు. అటువంటి ప్రదేశాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ పాలిథిన్ వినియోగాన్ని శత శాతం నిషేధించాలని ఆయన చెప్పారు. పాలిథిన్ వినియోగిస్తే అపరాధ రుసుం విధించడం వంటి అంశాలను ఆలోచించాలన్నారు. డస్ట్ బిన్‌లను పక్కాగా ఏర్పాటు చేయాలని, సూచిక బోర్డులను సాంప్రదాయ బద్ధంగా ఏర్పాటు చేయాలని ఆయన చెప్పారు.

ప్రపంచ పర్యాటక దినోత్సవానికి ఏర్పాటు చేయాలి

ప్రపంచ పర్యాటక దినోత్సవానికి పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పర్యాటక అభివృద్ధికి పర్యాటక దినోత్సవం దోహదం చేయాలని ఆయన అన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

శంబర ప్రధాన వీధి అభివృద్ధి చేయాలి

శంబర పోలమాంబ ఉత్సవాలు ఘనంగా జరిగేందుకు ప్రధాన వీధి అభివృద్ధి చేయాలని కలెక్టర్ అన్నారు. ఉత్సవాలు బాగా నిర్వహించేందుకు అవసరమైతే వీధిలో ఉన్న ఆక్రమణలు తొలగించాలని ఆయన సూచించారు. ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. ప్రధాన వీధి రహదారి పనులు వెంటనే ప్రారంభించాలని, తాగు నీటి సరఫరా చూడాలని, మరుగుదొడ్లు అవసరం మేరకు నిర్మించాలనిఅన్నారు. సంబంధిత అధికారులు సందర్శించి నివేదిక సమర్పించాలని ఆయన ఆదేశించారు. జిల్లా అటవీ అధికారి జిఎపి ప్రసూన మాట్లాడుతూ సీతంపేట మండలంలో బెనరాయ్ వాటర్ ఫాల్స్, పొల్ల వ్యూపాయింట్, సున్నపుగెడ్డ వాటర్ ఫాల్స్ వద్ద పర్యాటక అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామన్నారు. బెనరాయ్ వాటర్ ఫాల్స్ వద్ద రూ.40 లక్షలతోను, పొల్ల వ్యూ పాయింట్ వద్ద రూ.12 లక్షల తోనూ, సున్నపుగెడ్డ వాటర్ ఫాల్స్ వద్ద రూ.70 లక్షల తోనూ అభివృద్ధికి ప్రతిపాదించామని తెలిపారు. సమావేశంలో పర్యాటక ప్రాంతీయ సంచాలకులు శ్రీనివాస్, పర్యాటక అధికారి ఎన్ నారాయణరావు, సభ్యులు డా టి.హేమాక్షి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి కె రామచంద్రరావు, శంబర పోలమాంబ కార్యనిర్వాహక ఇంజినీర్ నారాయణ, పాల్గొన్నారు.

తుపాన్లను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు

ఇటీవల సంభవించిన తుఫాన్లను ఎదుర్కొనేందుకు జిల్లాలో అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర హెూం, విపత్తుల నిర్వహణ శాఖమంత్రి వంగలపూడి అనిత విశాఖపట్నం జిల్లా కలెక్టరు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఎస్పిలతో ఇటీవల కురిసిన వర్షాలు, జిల్లాల్లో జరిగిన నష్టాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టరు, ఎస్పి పాల్గొన్నారు. జిల్లాకు సంబంధించిన వివరాలు కలెక్టర్ తెలియజేస్తూ జిల్లాలో ఒక మేజరు, నాలుగు మీడియం సాగునీటి ప్రాజెక్టులు ఉన్నాయని, వాటి సామర్థ్యానికి లోపల నీటినిల్వలు ఉన్నాయని తెలిపారు. ముందు జాగ్రత్తగా నదిపరీవాహక ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు 134 ఎకరాలలో పండ్లతోటలు, 24 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగిందని తెలిపారు. జిల్లా కేంద్రం, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశామన్నారు. మారుమూల, గిరిశిఖర గ్రామాల్లో గల గర్భిణులను గర్భిణుల వసతిగృహాలకు తరలించినట్లు కలెక్టరు తెలిపారు. జిల్లాలో రెండు రాష్ట్ర రహదారులు, కూనేరు-రామభద్రపురం రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నాయని, వాటికి వెంటనే మరమ్మతులు నిర్వహించాల్సి ఉందని తెలిపారు. ప్రభుత్వానికి అంచనాలతో ప్రతిపాదనలు పంపించడం జరిగిందని తెలిపారు. ఎన్‌డిఆర్ఎఫ్ బృందాన్ని సాలూరులో సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ఎస్పి మాధవరెడ్డి మాట్లాడుతూ పాచిపెంట, సాలూరు, కొమరాడ మండలాల్లో ఎగువ కురిసిన వర్షాలకు గెడ్డలు ఆకస్మికంగా పొంగుతున్నాయని, ఇటీవల పాచిపెంట మండలంలో హర్యానాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు గెడ్డలో కొట్టుకుపోయి చనిపోయారన్నారు. ఇటువంటి సంఘటనలను నివారించేందుకు గెడ్డలపై గల కల్వర్టులు ఎత్తును పెంచాలని తెలిపారు. గెడ్డలు పొంగిన సందర్భంలో ప్రజలు రాకపోకలు జరపకుండా చర్యలు తీసుకుంటున్నా మని తెలిపారు. గణేష్ విగ్రహాల నిమజ్జనానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సైబర్ నేరస్తుడి నుంచి నగదు రికవరీ : ఎస్పి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

సైబర్ నేరస్తుడి చేతిలో మొసపొయి నగదు పోగొట్టుకున్న బాధితురాలి నగదును తిరిగి ఆమె ఖాతాకు జమయ్యేలా జిల్లా పోలీసులు చేపట్టారు. ఈ మేరకు మంగళవారం ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి మాట్లాడుతూ ఇటీవల భామిని మండలానికి చెందిన దులాపు రమణమ్మ ఇంటి వద్దే వుండి ఆన్లైన్ లో పనిచేసుకోని డబ్బులు సంపాదించవచ్చు అనే ఆలోచనతో, ఆన్లైన్ తన వివరాలు నమోదు పర్చి పనికితగ్గ సమాచారం కోసం వెతగ్గా, ఇంతలో గుర్తు తెలియని సైబర్ నేరస్థుడు ఆమెను సంప్రదించాడు. అమెజాన్ మర్చంట్ ఉద్యోగిగా పరిచయం చేసుకొని, ఇంటివద్దనే ఉంటూ వాట్సాప్ ద్వారా తనకు అప్పగించిన పనులను (టాస్క్) పూర్తి చేయడం ద్వారా ఆకర్షణీయమైన కమీషన్ వస్తుందని ఫిర్యాదురాలికి నమ్మబలికి అత్యాశ చూపి ఆమె వద్ద నుంచి దపదపాలుగా రూ.2,81,919 అతని ఖాతాలో డిపాజిట్ చేయించుకున్నాడు. తదుపరి సైబర్ నేరస్థుడి స్పందన అనుమానాస్పదంగా ఉండడాన్ని గమనించిన ఆమె సైబర్ నేరస్థుడి చేతిలో మోసపోయి నగదును పోగొట్టుకున్నాని గ్రహించి బత్తిలి పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో చేసి సంబంధిత బ్యాంకు అధికారులకు మెయిల్స్ ద్వారా విషయాన్ని తెలిపి, నగదు జమకాబడిన ఖాతాలను పరిశీలించి అందులో వున్నా సుమారు రూ1,81,919 నగదును ఆమె ఖాతాలోకి జమయ్యేలా చేసినట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించి పాలకొండ సిఐ చంద్రమౌళిని ఎస్పి అభినందించారు. సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా నేరాలు చేస్తూ ప్రజలను మోసగిస్తుంటారని, కావున ప్రజలు సైబర్ నేరాల పట్ల అవగాన కలిగివుండాలని, ఎవరైనా సైబర్ నేరగాళ్ల వల్ల నగదు పోగొట్టుకున్నట్లయితే వెంటనే వారు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో గానీ, ఆన్ లైన్ వెబ్ సైట్ www.cyber-crime.gov.in ద్వారా గానీ, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో గానీ, టోల్ ఫ్రీ నెంబర్ 1930 కు ఫిర్యాదు చేయొచ్చని ఎస్పి తెలిపారు.

పెద్ద రామ బ్రిడ్జి మరమ్మతులకు చర్యలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పెద్దరామ వంతెన మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపిడిఒ కె.గీతాంజలి తెలిపారు. ఈమేరకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. మంగళవారం పెదరామ బ్రిడ్జి సందర్శించిన ఎంపిడిఒ పిఐయు శాఖ నుంచి ఎఇ గౌరీ శంకర్ బ్రిడ్జ మరమ్మతుల నిమిత్తం కలెక్టర్‌కు పూర్తి వివరాలు తెలియజేశామన్నారు. ఆ గ్రామసర్పంచి , సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు అటుగా భారీ వాహనాలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ బ్రిడ్జి మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎఇకి సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

వైభవంగా కోటదుర్గ ఉత్సవాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాలకొండ

అక్టోబర్ 3 నుంచి జరగబోయే కోటదుర్గ అమ్మవారి ఉత్సవాలు ఘనంగా జరిగేలా చూడాలని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయక్రిష్ణ అన్నారు. మంగళవారం కోటదుర్గ అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు కోసం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. అదే విధంగా పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టాలన్నారు. వచ్చిన యాత్రికులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసుకుని ఉత్సవాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎమ్మెల్సీ పాలవలన విక్రాంత్ మాట్లాడుతూ దసరా ఉత్సవ ఏర్పాటుకు ఉత్సవ కమిటీ ఏర్పాటు కావాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ఉత్సవాలు జరిపించాలన్నారు. పూర్తి సహకారం తామందిస్తామని అన్నారు. టిడిపి జిల్లా కార్యదర్శి కర్నేని అప్పలనాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి ఈ కమీటీలో సభ్యులుగా వేయాలన్నారు. టిడిపి పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఉత్సవాల్లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అందరూ సహకరించాల న్నారు. సమావేశంలో పట్టణ వైసిపి అధ్యక్షులు వెలమల మన్మథరావు, మండల టిడిపి అధ్యక్షులు గండి రామినాయుడు, జనసేన నాయకులు గర్భాన సత్తిబాబు, జిల్లా అధ్యక్షులు దావాల రమణ రావు, కోటదుర్గ ఆలయ ఇఒ మురళీకృష్ణ, సిఐ చంద్రమౌళి, ఎస్సై ప్రయోగ మూర్తి, తదితరులు ఉన్నారు.

రైతు, కౌలు రైతుల సమస్యలపై
నేడు, రేపు సచివాలయాల వద్ద ధర్నాలు

ప్రజాశక్తి - బలిజిపేట

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 11,12 తేదీల్లో గ్రామ సచివాలయాలు వద్ద, 25, 26 మండల ఆఫీసు వద్ద జరుగు ధర్నాలను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేకు మంగళవారం ఆందోళన కరపత్రాలు స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేలు ఇస్తామని, రైతులకు వ్యవసాయానికి ఎంతో ఉపయోగపడుతుందని, కౌలు రైతులు వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారని అన్నారు. మూడు నెలలవుతున్నా ఇప్పటికీ పెట్టుబడి సహాయం లేదన్నారు. రైతులు మదుపులు పెట్టి ప్రైవేటు వ్యక్తి దగ్గర అప్పులు తెచ్చి ఆ అప్పులు తీర్చడానికి బ్యాంకుల చుట్టూ రుణాల కోసం తిరుగుతున్నా లాభం లేదన్నారు. కావున ఇప్పటికే రైతులు మద్దతు ధర చాలక వ్యవసాయం లాభసాటి కాక చాలా మంది వ్యవసాయానికి దూరమవుతున్నారని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఒక్కొక్క రైతుకు రూ.2లక్షలు రుణమాఫీ చేయాలని, కౌలు రైతులకు 2011 కౌలుదారి చట్ట ప్రకారం కార్డు ఇచ్చి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకు రుణాలు ఇవ్వాలని, కౌలు రైతులకు ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వాలని, రైతులకు నష్టం చేసే వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెట్టే జీవో 22 రద్దు చేయాలని, రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల11,12, 25, 26 తేదీల్లో జరుగు సచివాలయాలు, మండల కార్యాలయాల వద్ద తలపెట్టిన ధర్నాలను జయప్రదం చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతుల సంఘం నాయకులు బొద్దాన భానుమూర్తి, పీశ వెంకటస్వామి, చినబాబు పాల్గొన్నారు.


వరద బాధితులకు నిత్యవసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

వరద సహాయక చర్యల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

విజయవాడ ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యల్లో నిమగ్నమై బాధితులకు, బాధితులకు అండగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే విజయ్ చంద్ర ముంపు ప్రాంతంలో పాల్గొన్నారు. మంగళవారం విజయవాడ చేరుకొని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి బాధితుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వైద్యం, తాగునీరు, ఆహారం, నిత్యావసర సరుకులు అందేలా ఇంటింటికి వెళ్లి సేవలు అందించారు.

ముంపునకు గురైన వరి పంట పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో ఇటీవల కురిసిన వర్షాలతో వరి పంట నీటిలో మునిగింది. లక్ష్మీపురంలో ముంపునకు గురైన వరి పంటను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు ఎక్కడైనా ముంపునకు గురైతే ఆయా గ్రామ వ్యవసాయ శాఖ సిబ్బందితో సమాచారం తెలుసుకొని జిల్లా స్థాయి అధికారులకు నివేదికలను పంపిస్తామన్నారు. అలాగే రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈ పంట నమోదును జోగింపేటలో పరిశీలించారు. ప్రతి రైతు తన పంటను ఈ-క్రాప్‌ను చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామ వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇకెవైసి త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

రైతులు పండించిన అన్ని పంటలను ఈనెల 15లోగా ఈ పంటలో నమోదు చేసి ఇకెవైసి పూర్తి చేయాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని గురువునాయుడుపేట, సరాయివలస రైతు సేవ కేంద్రాల పరిధిలో పంటల నమోదు, ఇకెవైసిని పరిశీలిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని గ్రామ వ్యవసాయకులను ఆదేశించారు. రైతులు కూడా విధిగా రైతు సేవా కేంద్రాలను సంప్రదించి తమ పంటల నమోదు సరిగ్గా ఉన్నది లేనిదీ తెలుసుకోవాలని కోరారు. అనంతరం బైరిగుడ్డిలో రైతులకు ద్రవ జీవామృతం తయారీని వివరించారు. కార్యక్రమంలో విఎఎఒ గణేష్, సాయి గణేష్, సిఆర్‌పి సూర్యారావు, ఐసిఆర్‌పి సుకరమ్మ, రైతులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విజయవాడ వరద బాధితులకు టిడిపి అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు రూ. 20వేలు నగదును కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి మంగళవారం గుమ్మలక్ష్మీపురంలో అందించారు. ఉద్యోగులు, వ్యాపారులు తమకు తోచిన ఆర్థిక సాయం చేస్తూ బాధితులకు అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బ లోవరాజు, టిడిపి నాయకులు మండగి భూషణరావు, కళావతి, కురుపాం మండల టిడిపి అధ్యక్షులు కొండయ్య, జియమ్మ వలస మండల కార్యదర్శి రాజేంద్ర, కురుపాం నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు గురాన శ్రీరామమూర్తి నాయుడు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

స్థానిక వెలుగు కార్యాలయంలో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల సమైక్య నాయకులు మంగళవారం కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి వినతి అందించారు. ప్రధానంగా మెయిన్ రోడ్డు నుంచి కార్యాలయం వరకు రోడ్డు లేకపోవడంతో వర్షం పడితే పూర్తిగా బురదమయమవుతుందని, రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. సిసి రోడ్డు మంజూరు చేయాలని కోరారు. కార్యాలయం సమీపంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, సమావేశాల సమయంలో నీటి కోసం బయటికి వెళ్లాల్సి వస్తుందని, కావున బోరు నిర్మించాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో మహిళా సంఘాలను బలోపేతం చేయమని మహిళా సమైక్య నాయకులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షులు కె.చిలకమ్మ, ప్రధాన కార్యదర్శి ఎన్.ఊర్వశి, కోశాధికారి జి. శోభారాణి, సభ్యులు ఉన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో వరద బాధితులకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి -కొమరాడ

విజయవాడ వరద బాధితుల సహాయార్థం సిపిఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించినట్లు సిపిఎం నాయకులకు కొల్లి సాంబమూర్తి తెలిపారు. మంగళవారం కొమరాడలో వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించారు. రూ.2650 విరాళాలు సేకరించామని ఈ డబ్బులు సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు ఇవ్వనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి శివున్నాయుడు, గణపతి, రాము, లక్ష్మణరావు పాల్గొన్నారు.

పిల్లలను ఫోన్లకు దూరంగా ఉంచాలి : సిఐ

ప్రజాశక్తి - సాలూరురూరల్

తల్లిదండ్రులు పిల్లలను ఫోన్లకు దూరంగా ఉండేలా చూడాలని రూరల్ సిఐ పి.రామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్మార్ట్ ఫోన్ వినియోగం వల్ల చదువుపై శ్రద్ధ లేకుండా జీవితంలో ఏం సాధించాలో అన్నది మర్చిపోయి ఈ వయసులో సరదాలకు అలవాటపడి చాలామంది జీవితాలను పాడు చేసుకుంటున్నారని అన్నారు. ఫోన్ల కు దూరంగా ఉంచేలా చూసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామస్తులు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై నరసింహ మూర్తి, సర్పంచ్ సువ్వాడ శశికళ, డొంక అన్నపూర్ణ భూస తవుడు, మాధవరావు, టిజతిరుపతిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మూన్నాళ్ల ముచ్చట...

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని ప్రధాన రహదారి విస్తరణ పనులు మూన్నాళ్ల ముచ్చటగా మారిందని సిపిఎం మండల నాయకులు ఎన్.సింహాచలం అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వట్టిగెడ్డ వంతెన నుండి పెట్రోల్ బంక్ వరకు 1.2 కిలోమీటర్ల పరిధిలో రూ 5.5 కోట్లతో చేపట్టిన ప్రధాన రహదారి విస్తీర్ణం పనులు అధికారుల పర్యవేక్షణా లోపంతో గుత్తేదారు ఇష్టానుసారంగా పనులు చేపట్టడంతో బిటి రహదారి నిర్మాణ పనులు చేపట్టి 4నెలలు అయ్యేసరికి ప్రధాన రహదారి ఎక్కడికక్కడ గుంతలుగా గుంతలుగా తయారయ్యిందన్నారు. ప్రధాన రహదారిపై వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా అంబేద్కర్ జంక్షన్ వద్ద బిటి రహదారి గుంతలుగా ఏర్పడడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. మండల ప్రజల చిరకాల వాంఛ అయిన ప్రధాన రహదారి విస్తీర్ణ పనులు జరిగినప్పటికీ నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో ప్రధాన రహదారి ఈ పరిస్థితికి చేరుకుందన్నారు. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి గుత్తేదారుపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధాన రహదారి విస్తీర్ణం పనుల్లో భాగంగా రహదారికి ఇరువైపులా ఉన్న సుమారు 10 కుటుంబాలు పైబడి సర్వం కోల్పోయి వీధిన పడ్డాయని, బాధితులకు నష్టపరిహారం చెల్లించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఆర్యవైశ్య మహిళా సంఘ వార్షికోత్సవం

ప్రజాశక్తి -సాలూరురూరల్

పట్టణంలోని ఆర్యవైశ్య మహిళా సంఘ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య ధర్మశాలలో నిర్వహించిన కార్యక్రమంలో 26వ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. గత 25 ఏళ్లలో మహిళా సంఘం ఆధ్వర్యాన చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులకు సాంస్కృతిక, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఇండుపూరి నారాయణ రావు, సభ్యులు బలబద్రుని శ్రీనివాసరావు, బొర్రా రామారావు, మార్కండేయ మూర్తి పాల్గొన్నారు.

ఈ రోడ్డుపై ప్రయాణం ప్రమాద భరితం

చెరువులుగా మారిన పరిస్థితి...
అధ్వానంగా అంతర్రాష్ట్ర రహదారి

ప్రజాశక్తి -కొమరాడ

పార్వతీపురం నుంచి ఒడిశా వెళ్లే రహదారి కూనేరు వరకు మరింత అధ్వానంగా మారింది. ప్రయాణికులు రోడ్లపైన ప్రయాణిస్తున్నారా లేక చెరువులపైన ప్రయాణిస్తున్నారా అర్థం కాని దయనీయ స్థితిలో ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గుమడ, కొమరాడ, చోళ పదం, కూనేరు సరిహద్దు ప్రాంతం వద్ద రోడ్డుపైన వరదనీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. ఇప్పటికే రోడ్లపై ఉన్న గోతులు కనిపించకపోవడంతో నేరుగా వాహనదారులు గోతుల్లో పడిపోయి ప్రమాదాలు బారిన పడుతున్నారు. ఈ రోడ్లపై ప్రయాణించాలంటే ప్రాణాలతో చెలగాటమాడుతూ ప్రయోజనాలు చేస్తున్నామని, తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణం చేయాలని ప్రజలు అంటున్నారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇప్పటికే ఉన్న అధ్వాన రహదారులు మరీ అధ్వానంగా మారి ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు, చిన్నకారులపై వెళ్లే ప్రయాణికులు ఈ గోతుల వల్ల అనేక అవస్థలుపడుతూ తమ వాహనాలను మరమ్మతులు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై ఉన్న వర్షపు నీటిని కనీసం దారి మళ్ళించే చర్యలు కూడా ఆర్అండ్‌బి అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోతులు కప్పకపోయినా వర్షం నీరు రహదారిపై లేకుండా చర్యలు చేపడితే కొంతమేరకు ప్రమాదాలను నివారించవచ్చని ప్రజలు అంటున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చి రహదారులు బాగు చేస్తారని ఆశపడ్డ ప్రజలు, ప్రయాణికులకు ఈ రోడ్ల పరిస్థితి చూసి కొంత నిరాశ మిగులుతుంది. సిపిఎం ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు చేసినప్పటికీ ఆ ఒక్క రోజుకు మాత్రమే తాత్కాలికంగా మట్టి పోసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు తప్ప శాశ్వతంగా గోతులు కప్పేందుకు ముందుకు రాకపోవడం చాలా దురదృష్టకరమని ప్రజలు అంటున్నారు. కొమరాడ మండలంలో సుమారు పది చోట్ల రహదారిపై భారీ గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతులు ఏర్పడడానికి ప్రధాన కారణం ఆర్ ఎం బి అధికారుల నిర్లక్ష్యమేనని ప్రజలు ఆరోపిస్తున్నారు. రహదారిపై వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపడితే మరమ్మతులకు గురయ్యే అవకాశం ఉండేది కాదని ఇప్పటికైనా రహదారిపై ఎక్కడెక్కడ వర్షపు నీరు నిల్వ ఉంటుందో నీటిని దారి మళ్లిస్తే కొంత రోడ్లో బాగు చేసినట్టేనని ప్రజలు అంటున్నారు. తక్షణమే అధికారులు స్పందించి ఈ రోడ్డుపై ప్రయాణించే ప్రజలకు, వాహనదారులకు భరోసా కల్పించాలని కోరుతున్నారు.


అధ్వానంగా తయారైన పార్వతీపురం-కూనేరు అంతర్‌రాష్ట్ర రహదారి దుస్థితి

వరద బాధితుల సహాయం కోసం పౌరాణిక నాటక ప్రదర్శన

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు పార్వతీపురానికి చెందిన శ్రీవాణి శివాని నాట్య కళామండలి ఆధ్వర్యంలో ఈ నెల 15న పౌరాణిక నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసి తద్వారా దాతలు నుంచి విరాళాలు సేకరిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు నాగిరెడ్డి సింహాచలం, అమలాపురం రామకష్ణ తెలిపారు. మంగళవారం ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు బడే శ్రీరాములునాయుడు మొదటి విరాళాన్ని రూ.54,999 అందించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 15న ఉత్తరాంధ్రకు చెందిన ఎడ్ల గోపాలరావు, కెవి పద్మావతి, దాసరి తిరుపతిరావు వంటి ప్రముఖ కళాకారులచే మోహిని భస్మాసుర, కాళహస్తీశ్వర మహత్యం, సత్య హరిశ్చంద్ర పౌరాణిక నాటకాల్లో ముఖ్యమైన సీన్లను ప్రదర్శిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యే పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్రకు ప్రేక్షకుల సమక్షంలో ముఖ్యమంత్రి సహాయ నిధికి సేకరించిన విరాళాలను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పెంట సత్యంనాయుడు, ఎంద్రాపు చినరామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాట్రగడ వద్ద వరద ఉధృతిని పరిశీలించిన అధికారులు

భామిని : కాట్రగాఢ -బి వద్ద వంశధార వరద ఉధృతిని వంశధార డిఇ భవానీ శంకర్ సిబ్బందితో పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలతో వంశధార నదిలో 11,000 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుందని తెలిపారు. వంశధారలో నీటి మట్టం పెరగడంతో కాట్రగాఢ -బి హెడ్ రెగ్యులేటర్ ద్వారా వంశధార కుడి కాలువకు నీరు ప్రవహిస్తుందని తెలిపారు. నేరడి బ్యారజీ వంశధార కుడి కాలువ ద్వారా 4వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నట్లు డిఇ తెలిపారు.

12న ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని సాయి నగర్ కాలనీ సమీపాన సత్య సాయి మందిరంలో ఈనెల 12న ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సత్య సాయి ఆలయ కమిటీ నిర్వహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొండ మండలం బడ్డుమాసింగికి చెందిన నవజీవన్ తిరుపతి ఆర్థిక సహాయంతో ప్రగతి సేవ సొసైటీ సౌజన్యంతో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని చుట్టుపక్కల గ్రామాలకు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఉచిత నేత్ర వైద్య శిబిరానికి వచ్చిన వారు తప్పనిసరిగా ఆధార్ లేదా రేషన్ కార్డు పట్టుకొని రావాలని సూచించారు.

పలు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదభోగిలి, గుచ్చిమి, కాసాపేట గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. పెదభోగిలి సర్పంచ్ జొన్నాడ తెరేజమ్మ ఆధ్వర్యంలో కుమ్మర వీధి, నీలాటి రేవుకు ఇరువైపులా జంగిల్ పనులు చేపట్టారు. గుచ్చుమిలో కాలువల్లో పూడికతీతలు, నీళ్ల ట్యాంకర్లు క్లోరినేషన్ పనులు చేపట్టారు. కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచ్ ఎం.శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి డి.ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

ఇళ్లపై సోలార్ యూనిట్ అమర్చుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

సాంప్రదాయేతర ఇంధన వనరుల ప్రోత్సాహంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పిఎం సూర్య ఘర్ సబ్సిడీ వినియోగించుకొని ప్రతి ఒక్కరూ సోలారు విద్యుత్ యూనిట్ ఏర్పాటు చేసుకోవాలని కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలారు యూనిట్ ఏర్పాటుతో ఉత్పత్తి అయిన విద్యుత్ మనం వాడుకోగా మిగిలిన విద్యుత్‌తో ఆదాయం వస్తుందన్నారు. రానున్న మూడు నెలల్లో వెయ్యి కిలోవాట్ల సామర్థ్యం గల సోలారు యూనిట్ల ఏర్పాటు లక్ష్యంగా పూర్తిచేయాలని విద్యుత్, మున్సిపల్ సంస్థలను ఆదేశించారు. ఇ విద్యుత్ శాఖ ఎస్ఇ ఎం. లక్ష్మణరావు మాట్లాడుతూ వినియోగదారులు 10 కిలోవాట్ల వరకు నేరుగా దరఖాస్తు చేసుకొనవచ్చునని, రూ.1300 ఫీజు చెల్లించిన తర్వాతే దరఖాస్తు ప్రక్రియ చేయబడుతుందని తెలిపారు. మూడు కిలోవాట్ల వరకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని, ఒక కిలోవాటుకు రూ.30వేలు, రెండు కిలోవాట్లకు రూ.60వేలు, 3 కిలోవాట్లకు రూ.78 వేలు సబ్సిడీగా ప్రభుత్వం యూనిట్ స్థాపించిన పిదప 45రోజుల్లో తిరిగి వినియెగాదారుని బ్యాంకు ఖాతాకు అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, వసతిగృహలు తదితర భవనాలకు సంబంధించి డిసెంబరు 2025నాటికి విద్యుత్ శాఖ ద్వారా సోలారు యూనిట్లు స్థాపించాలని లక్ష్యం నిర్ణయించారని,ఇప్పటికే 26 కార్యాలయాల్లో సోలారు సదుపాయం ఉందన్నారు. పిఎం కుసుం పథకం ద్వారా వ్యవసాయానికి విద్యుత్ అందించే 9 ఫీడర్ల దగ్గర 25.25 మెగావాట్ల సోలారు యూనిట్ల ఏర్పాటుకు ప్రతిపాదించినట్లు తెలిపారు. సమావేశంలో విద్యుత్‌శాఖ ఇఇ కె.గోపాలరావు నాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, జిల్లా సాంఘిక, బిసి సంక్షేమ సాధికారిత అధికారులు ఎం.డి.గయాజుద్దీన్, ఎస్.కృష్ణ,ఇతర అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార ప్రదర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని బూర్జిగూడ అంగన్వాడీ కేంద్రంలో న్యూట్రిషన్ ఫుడ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాణి, నోడల్ అధికారి రాజ్యలక్ష్మి పర్యవేక్షించారు. గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అంగన్వాడీలు అందిన పౌష్టికాహారం గురించి వివరించారు. గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. న్యూట్రిషన్ ఫుడ్ కాయగూరలు తీసుకుంటే గర్భిణీలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పౌష్టికాహారం వల్ల ఉపయోగాలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిడిపిఒ పి.రంగ లక్ష్మి, సూపర్వైజర్లు గౌరీ తదితరులు పాల్గొన్నారు .

ప్రతి గ్రామానికీ రోడ్డు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ ఇంజనీరింగు అధికారులను ఆదేశించారు. మంగళవారం పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా, రోడ్లు భవనాలు, గిరిజన ఇంజనీరింగు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు సౌకర్యం లేని ప్రతి గ్రామాన్ని గుర్తించి, రోడ్డు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గిరిజన, మారుమూల గ్రామాల నుంచి డోలీ మోతలు లేకుండా వారికి రహదారి సౌకర్యం కల్పించేందుకు ఇంజనీరింగు పనుల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అవసరం లేని పనులను రద్దు చేసి, అవసరమైన చోట్ల కొత్తగా ప్రతిపాదనలు పంపించాలని తెలిపారు. రోడ్డు కనెక్టివిటీ లేని గ్రామాలు, రహదారి అనుసంధానం, అసలు సిసిరోడ్డు లేని గ్రామాలు ప్రాధాన్యతా క్రమంగా పనులు చేపట్టాలని కలెక్టరు తెలిపారు. వర్షాలు పడే సమయం కావున మంచినీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. సమావేశంలో పలుశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పొలాలు ముంపునకు గురికాకుండా చర్యలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి కొమరాడ

నాగావళి నదిలో నీటి ప్రవాహం పెరగడంతో రైతుల పంట పొలాలు మునిగిపోయే పరిస్థితి ఉందని, భవిష్యత్తులో పంటలు మునిగిపోకుండా చర్యలు చేపడతామని కురుపాం ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి అన్నారు. మండలంలోని కల్లికోటలో మునిగిపోయిన పంట పొలాలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వరద ప్రవాహం ఎటువైపు నుంచి వచ్చింది, ఎన్ని ఎకరాలు పంటలు మునిగిపోయాయనే వివరాలను స్థానిక నాయకులను రైతులను అడిగి తెలుసుకున్నారు. గతంలో నిర్మించిన కర్రకొట్టు వద్ద ఖాళీ ఉండడంతో తోటపల్లి డ్యామ్‌కు వరదనీరు పోటెత్తిన సమయంలో కరకట్ల మధ్య ఉన్న ఖాళీ నుంచి నీరు ఎగువ ప్రాంతానికి వస్తుందని తెలిపారు. ఆ ప్రాంతంలో చెక్ డాం నిర్మిస్తే వరద ప్రవాహం ఎగువ ప్రాంతానికి రాకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందని స్థానికులు తెలిపారు. ఈ విషయంపై ఎంపిడిఒ మల్లికార్జునరావుతో మాట్లాడి సంబంధిత ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. తక్షణమే రెవెన్యూ, ఇరిగేషన్, మండల పరిషత్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. వర్షాలు తగ్గిన వెంటనే అవసరమైన చెక్ డ్యాము నిర్మాణం చేపట్టి భవిష్యత్తులో పొలాలు మునిగిపోకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఇప్పటికే కూరగాయలు పండించే రైతులు వరదల వల్ల నష్టపోతున్నారని, ఈ సమస్య భవిష్యత్తులో రాకుండా ఉండేందుకు కృషి చేస్తానని తెలిపారు. పంట పొలాలు మునిగిపోకుండా అవసరమైన చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం దృష్టిలో పెట్టి నిధులు మంజూరు చేసి అవసరమైన చెక్ గేట్లు, షెల్టర్లు ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా తోటపల్లి నిర్వాసితులైన పాతకల్లికోట గ్రామస్తులు తమకు రావాల్సిన హౌసింగ్ బిల్లులు పూర్తిగా చెల్లించలేదని తక్షణమే స్పందించి బిల్లులు చెల్లించాలని కోరారు. అలాగే అర్హులైన వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపు చేసేలా ప్రభుత్వంతో చర్చించి నిజమైన నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ రమేష్, హౌసింగ్ ఎఇ, మండల టిడిపి అధ్యక్షులు ఉదయ్ శేఖర్ పాత్రుడు, నాయకులు పి.వెంకట నాయుడు, గంగిరేగువలస ఎంపిటిసి గంట వెంకటనాయుడు, నాయకులు పడాల హరిప్రసాద్, మరిచర్ల సింహాచలం, సత్యనారాయణ, మరడాన తిరుపతినాయుడు, గుల్ల మాధవ్, మరదల కిషోర్, తదితరులు పాల్గొన్నారు.


కల్లికోటలో ముంపునకు గురైన పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

నిరుపయోగంగా ఉన్న భవనాలను వినియోగించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

నిరుపయోగంగా పడి ఉన్న అంగనవాడీ భవనాలను సక్రమంగా నడిపించాలని సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పాచిపెంటలో సిఐటియు, గిరిజన సంఘం నాయకులు కోరాడ ఈశ్వరరావు, కొర్ర సుబ్బారావు పిచ్చి మొక్కలతో నిరుపయోగంగా పడి ఉన్న అంగనవాడీ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగనవాడీ భవనాలను కట్టి ఏళ్లు గడిచినా నేటికీ తెరవలేదని దీనివల్ల ప్రజాధనం దుర్వినియోగం రావడం తప్ప ఎటువంటి ఉపయోగం లేదని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇటువంటి అంగనవాడీ భవనాలను ప్రారంభించకుండా వదిలేయడం వల్ల నిరుపయోగంగా పడి ఉన్నాయని, ఇప్పటికైనా ఈ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికంగా చర్యలు చేపట్టి అంగన్వాడీ భవనాలను నిర్మించి ఉన్న భవనాలను ప్రారంభించి చుట్టూ ప్రహరీ గోడల నిర్మించి పిల్లలకు ఆటలు ఆడేందుకు వీలుగా ఉంటుందని అన్నారు.

ఉపాధ్యాయురాలికి పౌర సన్మానం

ప్రజాశక్తి -సీతంపేట

మండలంలోని సిరికొండ జిపిఎస్ పాఠశాల ఉపాధ్యాయులు జి.గౌరమ్మకు మంగళవారం గ్రామస్తులు, ఉపాధ్యాయులు పౌరసన్మానం చేశారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా సెప్టెంబర్ 5న కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న గౌరమ్మను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ పాలక నారాయణ, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.కృష్ణారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అర్జునదొర, గౌరినాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రులు ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య, ఆరోగ్య శాఖ నిర్దేశించిన ప్రమాణాలను విధిగా పాటించాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ టి. జగన్మోహనరావు స్పష్టం చేశారు. ఈ మేరకు పట్టణంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలను(సాయి రమ్య నర్సింగ్ హోమ్, రఘు నర్సింగ్ హోమ్, లక్ష్మి హాస్పిటల్) మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్ల ధ్రువపత్రాలు, రెన్యువల్స్ సకాలంలో చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. తనిఖీలకు వచ్చిన గర్భిణులను వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, కుక్క కాటు, పాము కాటు చికిత్స వివరాలను వైద్య ఆరోగ్య శాఖ నిర్దేశించిన ఐహెచ్ఐపి పోర్టల్ లో నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం మామిడిపల్లిలో ఏర్పాటు చేసిన బాలాజీ లేబరేటరిని తనిఖీ చేసి నిర్దేశిత ప్రమాణాలను అమలు చేస్తున్న తీరును పరిశీలించారు.

గర్భిణీల వసతి గృహం పరిశీలన

స్థానిక వైటిసిలో ఉన్న గర్భిణుల వసతి గృహాన్ని జగన్మోహనరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ గర్భిణీలతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యసేవలు, పోషకాహారం వివరాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం 16 మంది గర్భిణీలు ఉండగా ఎక్కువగా తోనాం, గురువునాయుడుపేట పిహెచ్‌సిల పరిధిలో గిరిశిఖర గ్రామాల నుండి వచ్చినట్లు గుర్తించారు. మాతా శిశు సంరక్షణ కార్డుల్లో వారి ఆరోగ్య వివరాల నమోదును పరిశీలించి పలు సూచనలు చేశారు. గర్భిణీలకు పోషకాహార మెనూ సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఆరోగ్య శాఖ డెమోలు వై.యోగేశ్వర రెడ్డి, వి.సన్యాసిరావు ఉన్నారు.

సైబర్ నేరాలపట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పి.రమేష్ నాయుడు అన్నారు. మండలంలోని ఉద్దవోలు, చినగుడబ, వల్లరిగుడబలో మంగళవారం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉంటే మోసపోరని అన్నారు. అలాగే యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. గ్రామాల్లో ఎవరైనా సారా తయారు చేసినా, రవాణా చేసినా, విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే తక్షణమే పోలీసు లకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

33శాతం నష్టం జరిగితేనే నమోదు : ఉద్యానవన శాఖ ఎఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

అరటిపంటకు 33శాతం నష్టం జరిగితేనే వివరాలను నమోదు చేస్తామని ఉద్యానవన శాఖ ఎఒ టి.అమరేశ్వరి రైతులకు సూచించారు. మండలంలోని కంబర, నడుకూరు, దశమంతపురం గ్రామాల్లో తుఫాను ప్రభావం వల్ల జరిగిన అరటిపంట నష్టాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నడుకూరులోని సుమారు 7 ఎకరాలు పైబడి 33శాతం పంట నష్టం వాటిల్లడంతో రైతులకు వివరాలు నమోదు చేశామన్నారు. దశమంతపురంలో ఎలాంటి నష్టం జరగలేదని అక్కడక్కడ మొక్కలు మాత్రం పడ్డాయని తెలిపారు.

గుమ్మగెడ్డ రిజర్వాయర్ గేటు ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని గుమ్మగెడ్డ రిజర్వాయర్‌కు గేటు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. 'ప్రజాశక్తి' మంగళవారం ప్రచురితమైన గుమ్మగెడ్డకు గండి అన్న 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు మంగళవారం గుమ్మగెడ్డ రిజర్వాయర్‌ను ఎస్ఎంఐ మైనర్ ఇరిగేషన్ డిఇ నారాయణ, ఎఇ నాగేంద్ర, ఎంపిడిఒ కె.గీతాంజలి సందర్శించారు. రిజర్వాయర్‌కు గేటు లేకపోవడం వల్ల నీరు వృథాగా పోతుందని అధికారులు గుర్తించారు. కలెక్టర్ అనుమతితో ఈ రిజర్వాయర్‌కు వేసవిలో గేటు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ గీతాంజలి తెలిపారు. రిజర్వాయర్ పరిశీలనలో ఎస్ హెచ్ఒ ఎం.జగదీష్ నాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ బాబురావు, విలేజ్ సర్వేయర్ బలరాం, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్యామ్, సచివాలయ సిబ్బంది చిన్నారావు, గ్రామస్తులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం : డిపిఎం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించి, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ పెదపెంకి షణ్ముఖరాజు కోరారు. మండలంలోని పి.ఆమిటి క్లస్టర్‌లో వంజరాపుగూడ, మండ, మొరమగూడలో గిరిజనులు పండిస్తున్న ప్రకృతి పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. పి.ఆమిటి పంచాయతీ వంజరాపుగూడలో అన్నపూర్ణ మోడల్‌లో పలు పంటలు, పండ్లు జాతులు, కూరగాయలు, ఆకు కూరలు, దుంప జాతులు, చిరుధాన్యాలు పంటలను పరిశీలించారు. రైతులతో నీమాస్త్రం సామూహికంగా తయారు చేయించారు. నీమస్త్రం రసాయనం వినియోగం వల్ల పంట ప్రారంభ దశలో పురుగులు గుడ్లు పెట్టకుండా పంటలకు రక్షణ ఇస్తుందన్నారు. డి.మండలో జీడి మామిడి తోటల్లో అంతర్ పంటలను పరిశీలించి రైతులకు సహాలు, సూచనలు ఇచ్చారు. మెరమగూడలో బిడ్డిక సురేష్ సాగు చేస్తున్న మామిడి తోటలో శ్రీ రాగి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంటి నిర్మలాదేవి, హెచ్ఎన్ ఎంటి గౌరీ తదితరులు ఉన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మనో నిబ్బరం కలిగి భావోద్రేకాలను అదుపు చేసుకొని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగడమే మానవ జీవిత సార్థకత అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ టి.శ్రీవరం విద్యార్థులకు మనోధైర్యం కలిగిస్తూ మాట్లాడారు. వరల్డ్ సూసైడ్ ప్రివెన్షన్ డే సందర్భంగా కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువును ప్రధాన ఆశయంగా భావించి బంగారు భవిష్యత్తు కోసం బాధ్యతగా చదువుకోవాలని కోరారు. అనంతరం ఐక్యూ ఎపి కోఆర్డినేటర్ వి.కల్పన మాట్లాడుతూ చెడు ఆలోచనలు, పనులు వల్ల చెడు ఫలితాలు కలిగి భావోద్రేకాలు అదుపు చేసుకోలేక ఆత్మహత్యల వైపు మనసు మల్లుతోందని అలా ప్రమాదకర పరిస్థితులు రాకూడదంటే విద్యార్థులు స్థిరమైన లక్ష్యాలు కలిగి ఆచరణాత్మక ప్రణాళిక ఏర్పాటు చేసుకొని ధైర్యంగా ముందుకు సాగాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు "ఆత్మహత్య అనివార్యమా? ఎందుకు" అంశంపై వ్యాసరచన, భావోద్రేకాలు అదుపు చేయడం ఎలా అంశంపై వకృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డి.రామయ్య, అధ్యాపకులు శ్రీవాణి, స్వరూప ఉన్నారు.

12నుంచి మండల స్థాయి ఆటల పోటీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈనెల 12 నుంచి నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సుంభోరా తెలిపారు. మంగళవారంవ్యాయామ ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పకడ్బందీగా క్రీడలు నిర్వహించడంతో పాటు అధిక సంఖ్యలో 14 ,17 అండర్ బాల బాలికలు పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.రామకృష్ణ, ఎస్‌వి రమణ, మండల పిఇటిలు ఎస్.ఉమామహేశ్వరరావు, వి.రాజేంద్ర, టి.మధు, ఎస్.పద్మరాజు, తదితరులు పాల్గొన్నారు.